# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ స్థాయి సేవలు అందించే స్థాయికి రాష్ట్ర యువత ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- రాష్ట్రంలో మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక రంగంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు.
- మహా విశాఖ నగరపాలక సంస్థ (GVMC) మేయర్‌గా కూటమి అభ్యర్థి, కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఈరోజు ఎన్నికయ్యారు.

==========================

దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను వారు అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో 'వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో'లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. వర్సిటీలో మహాత్మాగాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయి సేవలు అందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ను ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. క్వాంటమ్ వ్యాలీకి అమరావతి కేరాఫ్ అడ్రస్ కానుందని ముఖ్యమంత్రి వివరిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుందని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. ఈరోజు విజయవాడలోని రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్ల

రూపకల్పన కోసం జరిగిన మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక రంగంలో అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో విమానయానం, రక్షణ రంగాల్లో కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యంగా దేశంలోనే వంద శాతం రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి కృషి చేస్తున్నామని ఎంపీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

మహా విశాఖ నగరపాలక సంస్థ (GVMC) మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఈరోజు ఎన్నికయ్యారు. జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన జీవీఎంసీ పాలకవర్గ సమావేశంలో మేయర్‌గా కూటమి అభ్యర్థి కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ప్రకటించారు. దీనితో ఆయనకు ధ్రువపత్రం అందజేశారు. ఈ సమావేశానికి.. కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరయ్యారు. అనంతరం GVMC నూతన మేయర్‌గా పీలా శ్రీనివాసరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మరోవైపు గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. కూటమి బలపరిచిన రవీంద్రకు 34, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చిన వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. దీంతో మేయర్‌గా కూటమి అభ్యర్థి గెలిచినట్లు ప్రిసైడింగ్ అధికారి భార్గవ్ తేజ ప్రకటించారు.

===========================

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాల్లో సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రాజు తెలిపారు. తిరుపతిలో పాత్రికేయులతో ఎస్పీ ఈరోజు మాట్లాడుతూ.... రాష్ట్రంలో మొట్టమొదటిసారి సోలార్ తో పని చేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని.. వేసవి సెలవుల్లో విహారయాత్రకు వెళ్లేవారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో 50 సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని.. అలాగే తిరుపతి 20, గూడూరు 20, కోడూరు మామండూరుకు వెళ్లే మార్గంలో బ్లాక్ జోన్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

విరామం

===========================

మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మత్స్యకారుల సేవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు 20 వేల రూపాయలు వంతున కూటమి ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. ప్రతి కుటుంబం తలసరి ఆదాయం రెట్టింపు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

===========================

ఏలూరు జిల్లాలో 2024-25 రబీ సీజన్ కు సంబంధించి 12 వేల 380 మంది రైతుల నుంచి లక్షా 55 వేల 529 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఈరోజు ఏలూరులోని రబీధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో చేపట్టిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ... రైతుల నుంచి ఇంతవరకు 359.27 కోట్ల

రూపాయల ధాన్యం కొనుగోలు చేయగా అందులో ఇంతవరకు 206.71 కోట్ల రూపాయలను రైతుల ఆధార్ అనుసంధానిత ఖాతాల్లో జమచేయగా, మిగిలిన 150.30 కోట్లు రూపాయలు జమ చేయనున్నామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08812-230448, 77020 03584 నెంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

==========================

తిరుపతి జిల్లాలో ఈరోజు రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం తోటపల్లి దగ్గర ఓ కారు అదుపు తప్పి కంటైనర్ కిందకు దూసుకెళ్లడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

==========================

తిరుమలలో స్వచ్ఛంద సేవ చేయాలనుకునే సేవకులకు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీవారి సేవ స్వచ్ఛంద సేవ జూన్ నెల కోటాను ఈనె 30న ఆన్ లైన్ లో విడుదల చేస్తున్నామని టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది. జనరల్ శ్రీవారి సేవ తిరుమల, తిరుపతికి సంబంధించి ఉదయం 11 గంటలకు మహిళలకు నవనీత సేవ, మధ్యాహ్నం 12 గంటలకు పురుషులకు పరకామణి సేవ, మధ్యాహ్నం 1 గంటకు గ్రూప్ లీడర్ సేవ, కొత్తగా ప్రారంభించిన సేవకు మధ్యాహ్నం 2 గంటలకు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది.

==========================

పోర్టు పనులు త్వరగా పూర్తి చేయడం ద్వారా పోర్టు ఆధారిత పరిశ్రమలు మచిలీపట్నంలో ఏర్పడే అవకాశాలు ఉంటాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఈరోజు మంత్రి కొల్లు రవీంద్ర, APS RTC ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి జనార్ధన్ రెడ్డి మచిలీపట్నం పోర్టును పరిశీలించారు. అలాగే పోర్టు నిర్మాణ పనులను గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బందరులో పర్యాటక కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

==========================

రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో రేపు అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అలాగే గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది.

==========================
==========================